






వీడనున్న ఉత్కంఠ...!

- నేడు ఎన్నికల ఫలితాలు
- ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు
- మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు.. ఆ తర్వాత ఈవీఎంలు
- తేలనున్న నేతల భవితవ్యం



బైరెడ్డి శబరి, పోచా బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీనరసింహ, ఫరూక్, శిల్పా రవి చంద్ర కిశోర్, జయసూర్య, ధారా సుధీర్, సూర్యప్రకాష్‌రెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చక్రపాణి రెడ్డి, అఖిలప్రియ, జనార్దన్‌రెడ్డి, రామిరెడ్డి, గౌరు చరిత, రాంభూపాల్ రెడ్డి, బ్రిజేంద్రనాథ్

నంద్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. పోలింగ్ జరిగాక అభ్యర్థుల, పార్టీల జయాపజయాల ఉత్కంఠ తొలగిపోనున్నది. సార్వత్రిక ఎన్నికల హడావిడి మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కాగా, మే 13న పోలింగ్ జరిగింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన నేతల భవితవ్యం నేడు తేలనుంది. రెండు నెలలుగా నువ్వా, నేనా అని పోరు సలిపిన ప్రధాన పార్టీల జిల్లా నేతల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు పరాజయం పాలవుతారు? అనే ఉత్కంఠ వీడనుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి, ఆ తర్వాత ఈవీఎంల చిట్టా విప్పనున్నారు. జిల్లాకు సంబంధించి ఎన్నికల లెక్కింపు నంద్యాల శివారు ప్రాంతంలోని ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో చేపడతారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసింది. ఇక ఎన్నికల లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంది. మరికొద్ది గంటల్లో జిల్లాలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుంది? ఎవరి భవిష్యత్తు ఏమిటి? నంద్యాల పార్లమెంటుపై జెండా ఎగుర వేసేది ఎవరు? అనేది తేలిపోతుంది.



కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

లెక్కింపు ఇలా..

నంద్యాల జిల్లాలో ఆరు నియోజకవర్గాలతో పాటు పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల మండలాలు ఉన్నాయి. అయితే పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రక్రియ అంతా కర్నూలు నుంచే సాగుతోంది. ఓట్ల లెక్కింపు కూడా ఇదే విధంగా జరుగబోతోంది. పార్లమెంటు స్థానంతో పాటు, ఆరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నంద్యాల పరిధిలోనే జరుగుతాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయగా, నందికొట్కూరు, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన లెక్కింపు కేంద్రాలు శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో, డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శాంతిరాం ఫార్మసీ కళాశాలలో జరగనుంది. ప్రతి నియోజకవర్గానికి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక కౌంటింగ్ హాలు, పార్లమెంటు సెగ్మంటుకు మరొక కౌంటింగ్ హాలు చొప్పున మొత్తం 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక నంద్యాల పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మరొక కౌంటింగ్ హాలును ఏర్పాటు చేశారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 74 టేబుళ్లు, పార్లమెంటుకు 75 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల కోసం అసెంబ్లీకి 21, పార్లమెంటుకు 17 టేబుళ్ల చొప్పున ప్రత్యేకంగా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది.

ప్రతి 30 నిమిషాలకు ఒక రౌండు ఫలితం..

ఒక్కో కౌంటింగ్ హాలుకు 14 టేబుళ్ల చొప్పున రౌండ్ల వారీగా ఫలితాలను అధికారులు విడుదల చేయనున్నారు. లెక్కింపు 8 గంటలకు మొదలవుతుంది. తొలుత సైనిక దళాల్లో పనిచేసే సర్వీసు ఓట్లు, తర్వాత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. తర్వాత ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. సగటున ప్రతి 30 నిమిషాలకు ఒక రౌండు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో హాలులో ఏర్పాటు చేసిన టేబుళ్ల పైన ఈవీఎం యూనిట్ల లెక్కింపు పూర్తవడాన్ని ఒక రౌండు పరిగణిస్తారు. మధ్యాహ్నం 12 గంటలలోపు ఆయా నియోజకవర్గాల ఫలితాలపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈవీఎంలు మొరాయించకుండా, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే సాయంత్రం 5 గంటలలోపు నంద్యాల జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఎన్నికల లెక్కింపు కేంద్రాల వద్ద ఎలాంటి అలజడి చెలరేగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ, ఒక అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 35 మంది ఎస్ఐలు, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోం గార్డులు కలిపి 304 మంది వెరసి ఎన్నిక 368 లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తుగా ఉండబోతున్నారు. వీరితో పాటు స్పెషల్ పార్టీ, టీఎస్ఎఫ్ బలగాలు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది కూడా విధులు నిర్వహించబోతున్నారు. ఇక ఫలితాలు వెలువడిన తర్వాత గొడవలు రేగకుండా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చటం నిషేధించారు. అలాగే లెక్కింపు కేంద్రాల పరిసరాల పరిధిలో ఈ నెల 7 వరకు 144 సెక్షన్ అమలులో ఉండేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఎవరి ధీమా వారిది..

నంద్యాల జిల్లా పార్లమెంటు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 157 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలోనికి దిగారు. నంద్యాల పార్లమెంటుకు 31 మంది, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 28 మంది, ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో 18 మంది, బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో 28 మంది, డోన్ నియోజకవర్గ పరిధిలో 16 మంది, నందికొట్కూరు పరిధిలో 18 మంది, శ్రీశైలం నియోజకవర్గం పరిధిలో 18 మంది ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే వీరిలో నందికొట్కూరు నియోజకవర్గం మినహా, మిగతా నియోజకవర్గాల్లో పోటీ టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యనే ఉంది. ఇక ఈ రెండు పార్టీల అభ్యర్థులు ఈసారి ఎన్నికల్లో విజయం తమదంటే తమదంటూ ధీమాతో ఉన్నారు. అయితే ఆయా సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ ఫలితాలు తమకు అనుగుణంగా అన్వయించుకుంటున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని, జిల్లాలో తమ జెండా ఎగురబోతోందని నమ్మకంతో ఉన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా 746 మంది కౌంటింగ్ సిబ్బందిని ఆరు నియోజకవర్గాలను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించిన అబ్జర్వర్ల సమక్షంలో కౌటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా 221 మంది కౌటింగ్ సూపర్‌వైజర్లు, 278 మంది కౌటింగ్ అసిస్టెంట్లు, 247 మంది మైక్రో అబ్జర్వర్లను ఆరు నియోజకవర్గాలకు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. జూన్ 4వతేదీ కౌటింగ్ రోజు ఉదయం 5 గంటలకు 3వ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్‌లో కౌటింగ్ నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, 134-ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అన్నవి దినేష్‌కుమార్, 135-శ్రీశైలం అబ్జర్వర్ భగవత్ కిషోర్‌మిశ్రా, 136- నందికొట్కూర్ అబ్జర్వర్ అభిజిత్ ముఖర్జీ, 139-నంద్యాల అబ్జర్వర్ రాహుల్‌సింగ్, 140-బనగానపల్లె అబ్జర్వర్ డా. వేద్‌ప్రకాష్ మిశ్రా, 141-డోన్ అసెంబ్లీ నియోజకవర్గ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ అమిత్ కుమార్, రిటర్నింగ్ అధికారి ఎన్ఐసీ డీఐఓ అలెన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

నంద్యాల (కల్చరల్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు మొదట పోస్టల్ బ్యాలెట్‌కు ఎలక్షన్ కమిషన్ కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లెక్కింపు ప్రక్రియ నడుస్తుందని అన్నారు. పోస్ట్ ద్వారా వచ్చి కలెక్టరేట్‌లో స్టోరేజ్ చేసిన సర్వీస్ ఓటర్లు ఈటీపీబీఎస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 5 గంటలకు ఆర్జీఎంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకెళ్తామని అన్నారు.



ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు

దంచికొట్టిన వాన

- 29 మండలాల్లో భారీ వర్షపాతం నమోదు
- నల్లవాగులో 20 గొర్రెలు గల్లంతు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం



కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెలో ఇంటిపై కూలిన చెట్టు

నంద్యాల టౌన్, జూన్ 3: నైరుతి రుతు పవనాల రాకతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. మే నెలలో అక్కడక్కడా కొద్దిపాటి వర్షం కురిసినప్పటికీ పెరిగిన ఉష్ణోగ్రతల ప్రభావం, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. నైరుతి రుతు పవనాలు కేరళను తాకడంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మరికొన్ని చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నైరుతి రుతుపవనాల ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

బనగానపల్లె - నంద్యాల ప్రధాన రహదారిలో తిమ్మాపురం గ్రామం వద్ద ఉన్న పచ్చర్ల వాగు, టంగుటూరు గ్రామ సమీపంలోని అలుగాగు, చిన్న పిల్ల వంక, పెద్ద పిల్ల వంకలు ప్రవహించాయి. పాణ్యం-బనగానపల్లె రహదారిపై వద్దెలవాగు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నందికొట్కూరు మండలం నాగటూరు, కొణిదేల పొలాల్లో నీరు పారింది. కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామ పరిసరాల్లో పెద్ద ఎత్తున చెట్లు నేలకొరిగాయి. ఇటిక్యాల సమీపంలో ప్రధాన రహదారిలో వేప చెట్టు కూలిపోగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కనకాద్రిపల్లె సమీపంలో కోనాపురం నారపురెడ్డి ఫ్యాక్టరీలో చెట్లు, ఇళ్లపై పడటం, రేకులు లేచిపోవడంతో, సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బెలుంశింగవరం గ్రామంలో పిడుగు పడటంతో మహేశ్వరరెడ్డి ఇంటి గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రుద్రవరంలో గాలివానకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. కోవెలకుంట్ల మండలంలోని లింగాల, వల్లంపాడు గ్రామాల మధ్య ఉన్న కప్పలవాగు, వల్లంపాడు చిన్నకొప్పెర్ల గ్రామాల మధ్య ఉన్న నల్లవాగు, చిన్నకొప్పెర్ల, పెద్ద కొప్పెర్ల గ్రామాల మధ్య ఉన్న కైప వాగు, పెద్దకొప్పెర్ల, ఎంగోవిందిన్నె గ్రామాల మధ్య ఉన్న ఎర్రవాగులు ఉధృతంగా ప్రవహించడంతో పైగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లవాగు ఉధృతిలో 20 గొర్రెలు గల్లంతయ్యాయి.

బనగానపల్లెలో అత్యధికం.. గడివేములలో అత్యల్పం..

నైరుతి రుతుపవనాల రాక బనగానపల్లె మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. బనగానపల్లె మండలంలో 178.8 మిల్లీ మీటర్లు, పాణ్యం మండలంలో 153.6 మిల్లీ మీటర్లు, శ్రీశైలంలో 144.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే ఆత్మకూరు మండలంలో 84.2, నందికొట్కూరులో 80.2, జూపాడుబంగ్లాలో 77.4, కొలిమిగుండ్లలో 75.4, అవుకులో 66.2, కొత్తపల్లెలో 64.6, దొర్నిపాడులో 63.2, పాములపాడులో 58.2, కోవెలకుంట్లలో 57.4, మిడుతూరులో 54.2, గోస్పాడులో 50.6, ఆళ్లగడ్డలో 47.2, మహానందిలో 44.2, పగిడ్యాలలో 38.6, రుద్రవరంలో 35.4, నంద్యాలలో 34.8, డోన్‌లో 32.4, బేతంచెర్లలో 30.2, ప్యాపిలిలో 28.2, వెలుగోడులో 27.6, ఉయ్యాలవాడలో 27.0, బండిఆత్మకూరులో 26.6, సంజామలలో 20.4, చాగలమర్రిలో 18.0, శిరివెళ్లలో 15.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గడివేముల మండలంలో అత్యల్పంగా 10.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా, జిల్లా వ్యాప్తంగా సరాసరి 56.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.



నందికొట్కూరు మండలం కొణిదేల పొలాల్లో వర్షపు నీరు



పాణ్యం హైవే సర్వీసు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

మద్యం దుకాణాల్లో దోపిడీ

- ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా రూ.20
- హుశేనాపురంలో హర్యానా, గోవా, తెలంగాణ మద్యం
- మామూళ్ల మత్తులో పోలీసులు
- పని చేయని సీసీ కెమెరాలు



హుశేనాపురం వైన్ షాపు

ఓర్వకల్లు, జూన్ 3: మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, నన్నూరు వైన్‌షాపుల్లో ఎంఆర్‌పీ ధర కంటే రూ.20 అదనంగా ఇస్తేనే మద్యం ఇస్తున్నారు. క్వాటర్ బాటిల్‌కు రూ.20 అదనంగా తీసుకుని ఎంత కావాలంటే అంత మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వైన్‌షాపుల్లో సిబ్బంది అందిన కాడికి దోచుకున్నారు. ఒక్కొక్క కేసుకు రూ.1000 అదనంగా తీసుకుని కావాల్సినంత మద్యం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఇచ్చారు. వైన్‌షాపుకు రోజుకు 30 నుంచి 40 కేసులు మద్యం అమ్మాలని ప్రభుత్వం నిర్ణయిస్తే.. 10 కేసులు మాత్రమే మందుబాబులకు అందజేసి మిగతా కేసుల్లో బ్లాకుల్లో అమ్ముకుంటున్నారు. దీంతో ఒక్కరోజుకు రూ.15వేల నుంచి రూ.20వేల దాకా సొమ్ము చేసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు రోజు వైన్‌షాపుల్లో తూతూ మంత్రంగా అమ్మి రాజకీయ పార్టీల నాయకులకు కేసుకు రూ.1000 అదనంగా తీసుకుని రకరకాల బ్రాండ్ల మద్యం సీసాలను సంచుల్లో నింపి పంపించేవారు. ఈ మద్యాన్ని బ్లాకుల్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ శాఖ వారికి చెప్పినప్పటికీ వారు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. మూడు వైన్‌షాపుల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే పని చేస్తున్నది. వైన్‌షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఈ సీసీ కెమెరాల రికార్డులు చూస్తే అవినీతి ఎంత జరిగిందో అర్థం అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో వైన్‌షాపుల్లో సిబ్బంది లక్షలాది రూపాయలు జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఈ అవినీతి జరిగి ఉండవచ్చని మందుబాబులు చర్చించుకుంటున్నారు. హుశేనాపురం గ్రామంలో హర్యానా, గోవా, తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన మద్యం జోరుగా విక్రయిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. మంచి మద్యం బ్రాండ్లను వైన్‌షాపుల్లో తూతూ మంత్రంగా అమ్మి సిబ్బంది తన ఇంటి వద్ద ఫుల్ బాటిల్‌కు రూ.200 దాకా వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్‌షాపుల్లో మందుబాబులు తమకు కావాల్సిన బ్రాండ్లు కావాలని అడిగితే అవి అయిపోయాయని చీప్ లిక్కర్ అమ్ముతున్నారు. దీంతో మందుబాబులకు, సిబ్బందికి గొడవ జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎక్సైజ్ పోలీసులు దోపిడీని అరికట్టలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైన్‌షాపుల్లో సీసీ కెమెరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



హుశేనాపురంలో నిల్వ ఉంచిన మద్యం

అవినీతిని అరికట్టండి



వైన్‌షాపుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలి. మంచి మద్యం బ్రాండ్లను అడిగితే.. వైన్‌షాపు సిబ్బంది లేవని, చీప్ లిక్కర్ ఇచ్చి పంపుతున్నారు. దీంతో మద్యం ప్రియులు రోగాలబారిన పడుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

\- అల్లాబాబు, స్థానికుడు

నాణ్యమైన బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేయండి



వైన్‌షాపుల్లో నాణ్యమైన బ్రాండ్లను సరఫరా చేయాలి. నాణ్యమైన మందును పక్కదారి పట్టించి చీప్ లిక్కర్‌ను సరఫరా చేస్తున్నారు. ఈవిషయంపై సిబ్బందిని అడిగితే.. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

\- వేణుగోపాల్ రెడ్డి, స్థానికుడు

గ్రామాల్లో బెల్టుషాపుల జోరు:



ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లో బెల్టుషాపులు ఉండకూడదు. అయితే వైన్‌షాపు సిబ్బంది, బెల్టు షాపుల నిర్వాహకులు కుమ్మక్కై ఒక్కో బాక్సుపై రూ1000 అదనంగా తీసుకుని బెల్టు షాపు విక్రయదారునికి సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుస్తున్నాయి.

\-యాసిన్‌బాషా, స్థానికుడు

కోడి పందేల స్థావరంపై దాడి

చాగలమర్రి, జూన్ 3: చాగలమర్రి నుంచి నారాయణపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో కోడిపందేల నిర్వహిస్తున్న స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆళ్లగడ్డకు చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన నలుగురు, చాగలమర్రి, నంద్యాల, శిరివెళ్లకు చెందిన ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీసులు శివకాంత్, శివారెడ్డి, బాలు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్ల పట్టివేత

చాగలమర్రి, జూన్ 3: చాగలమర్రి గ్రామంలోని చాగలమ్మ ఆలయం వద్ద సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా 40 మద్యం బాటిళ్ల పట్టుబడ్డాయి. మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన నరసింహులును సోదా చేయగా అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్ల పట్టుబడ్డాయని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

కుక్కల దాడిలో రెండు దుప్పులు మృతి

ఆత్మకూరు, జూన్ 3: ఆత్మకూరు మండలంలోని అటవీ సమీప గ్రామమైన ముష్టెపల్లిలో సోమవారం కుక్కలు దాడిలో రెండు దుప్పులు మృతి చెందాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో అటవీ ప్రాంతంలోని సుమారు 5 దుప్పులు బెదిరిపోయి సమీప ముష్టెపల్లి గ్రామ శివారుకు చేరుకున్నాయి. వీటిని గమనించిన కుక్కలు వాటిపై దాడి చేయడంతో మూడు దుప్పులు సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లగా 6నెలల వయస్సు గల దుప్పికూన అక్కడికక్కడే మృతి చెందింది. మరో రెండేళ్ల వయస్సు గల దుప్పిని కుక్కలు గాయపరుస్తుండగా గ్రామస్థులు దుప్పిని రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బైర్లూటిలోని వన్యప్రాణి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా అది కోలుకోలేక మృతిచెందింది. రెండు దుప్పుల కళేబరాలను ఖననం చేసినట్లు బైర్లూటి రేంజ్ అధికారి సుభాష్ తెలిపారు.



కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పికూన

మహానందీశ్వరునికి 101 టెంకాయలు



ధ్వజ స్తంభానికి కొబ్బరి కాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

మహానంది, జూన్ 3: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయం సాధించాలని మహానంది మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం మహానంది క్షేత్రంలోని ధ్వజ స్తంభానికి 101 టెంకాయలు సమర్పించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి తెచ్చిన ప్రత్యేక జలాలతో మహానందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మధు, టీడీపీ నాయకులు కంచర్ల శివ, నాగపుల్లయ్య, శివ, మహేశ్వరరెడ్డి, మారెడ్డి సుబ్రమణ్యం, జయరాముడు, నాగరాజు, రంగస్వామి, సుంకులయ్య, మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

డయోగ్నస్టిక్ బ్లాక్‌లో అన్ని పరీక్షలు



ప్రారంభిస్తున్న డా.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హస్పిటల్), జూన్ 3: కొత్తగా నిర్మించిన న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని న్యూడయోగ్నస్టిక్‌లో ఈసీజీ మిషన్ సేవలు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డా. సునీల్ ప్రశాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రోగుల సౌకర్యం కోసం ఈసీజీ సేవలను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి అత్యవసర విభాగమైన క్యాజువాల్టీలో మరో ఈసీజీ మిషన్‌ను ఏర్పాటు చేశామని, న్యూడయోగ్నస్టిక్ స్టిక్ బ్లాకులో అన్ని సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో డా.వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.శివబాల పాల్గొన్నారు.

20 పడకలతో మరో క్యాజువాల్టీ: అత్యవసర రోగుల సౌకర్యార్థం 20 పడకలతో మరో క్యాజువాల్టీ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆసుపత్రిలో న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ రేడియాలజీ., క్యాజువాల్టీ ఔషధ శాలలను తనిఖీ చేశారు. క్యాజువాల్టీ రద్దీ దృష్ట్యా ఔషధ శాల, ఈసీజీ, ఓపీ నెంబరు -2ల స్థానంలో మరో క్యాజువాల్టీని ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రశాంత ఓట్ల లెక్కింపునకు చర్యలు: డీఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ

కౌంటింగ్ విధులపై డీఐజీ దిశానిర్దేశం



సమావేశంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

నంద్యాల క్రైం/పాణ్యం, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం చేపట్టాల్సిన విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కాలేజిలోని మీటింగ్ హాల్‌లో జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో కలిసి డీఐజీ పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. మూడంచెల భద్రతతోపాటు సాయుధ బలగాల ద్వారా ఫుట్ పెట్రోలింగ్ పార్టీ, మొబైల్ పార్టీలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించిన గుర్తింపు కార్డున్న వ్యక్తులు మినహా ఇతరులు లోపలికి ప్రవేశించకుండా తనిఖీ చేయాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తెచ్చుకోకుండా చూడాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను ఆర్‌ఓ ఆదేశాల మేరకు వెంటనే పికప్ వాహనాల్లో ఎక్కించాలని ఆదేశించారు. పెన్ను, పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌తోపాటు 30-పోలీస్‌యాక్ట్ అమల్లో ఉంటాయని తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరైనట్లయితే తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, డీఎస్పీలు కుమారస్వామి, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసరావు, తిలక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నల్లవాగులో వజ్రాన్వేషణ

రుద్రవరం, జూన్ 3 : నల్లమల అటవీ తీరంలోని నల్లవాగు ప్రాంతంలో సోమవారం ముమ్మరంగా వజ్రాల అన్వేషణ కొనసాగింది. వజ్రాలు దొరుకుతాయని ఆశతో ఒంగోలు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి భారీగా ఆశావహులు తరలివచ్చి నల్లవాగును జల్లెడ పడుతున్నారు. చిన్న చిన్న వజ్రంలాంటి రాళ్లను ఏరి దాచుకుంటున్నారు. వెదికితే ఒక్కటన్నా దొరకదా అనే ఆశతో వజ్రాల వేట సాగిస్తున్నారు. నల్లమల అడవిలో భారీ వర్షం కురవడంతో నల్లవాగులో నీటి ప్రవాహం మొదలైంది. వజ్రాల కోసం వచ్చిన నీటిలో సైతం రాళ్లను బయటకు తీసి వజ్రాలను అన్వేషిస్తున్నారు. కొందరికి వజ్రంలాంటి రాళ్లు దొరికాయని అక్కడ పలువురు చర్చించుకున్నారు.



దొరికిన వజ్రం లాంటి రాయి ఇలా..

నల్లమల అటవీ తీరంలో ప్రవహిస్తున్న నల్లవాగు



జల్లెడలో మట్టిని పోసి.. దులుపుతూ..



మట్టిని తీసి.. పరిశీలిస్తున్న మహిళ



వజ్రం కోసం మట్టిని తవ్వుతున్న వ్యక్తి

కౌంటింగ్ ఏర్పాట్లకు సర్వం సిద్ధం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 3: కౌంటింగ్ ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటరులో కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ హాల్ ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఇచ్చే శిక్షణ తరగతులు రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్ అబ్జర్వర్ల సీటింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్, మెడికల్ క్యాంపు, ఎలక్ట్రిక్ కనెక్షన్స్, ఎమర్జెన్సీ ఎగ్జిగట్ సిస్టమ్, ఫైర్ సేఫ్టీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వాళ్లు అధికారంలో ఉంటారని, ప్రశాంతతకు భంగం కలిగించకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. జిల్లా యంత్రాంగం, పోలీసుల సమష్టి కృషితో పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత ప్రశాంత వాతావరణం ఉందని, కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. కౌంటింగ్ హాల్ వద్ద నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాల్‌కు వెళ్లే ప్రతి ఈవీఎంకి కూడా ఏఆర్ ఎస్కార్ట్ ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు కాకుండా ఏ ఇతర వ్యక్తులు కూడా కౌంటింగ్ సెంటరులోకి ప్రవేశించకుండా 3 కట్ ఆఫ్ సెక్యూరిటీ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్లు వాహనాలకు కౌంటింగ్ హాల్‌కు 200 మీటర్ల ప్రాంగణంలో పార్క్ చేయించి ఫోన్లు డిపాజిట్ చేశాక ఏఆర్ పోలీసు టీమ్స్ మరలా ఒకసారి చెక్ చేసి కౌంటింగ్ హాల్లోకి పంపిస్తారని వివరించారు.

విద్యుత్ శాఖలో మరో ఉద్యోగిపై వేటు

- అక్రమ విద్యుత్ కనెక్షన్‌ల వ్యవహారంపై లైన్‌మెన్ సస్పెండ్
- నెల వ్యవధిలో ఇద్దరిపై వేటు

ఆలూరు, జూన్ 3: విద్యుత్‌శాఖలో అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నది. ఆలూరు మండల విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణను సస్పెండ్ చేసినట్లు ఆలూరు ఇన్‌చార్జి డీఈఈ పురుషోత్తం సోమవారం తెలిపారు. నెల వ్యవధిలో డీఈఈ నాగేంద్ర ప్రసాద్, అసిస్టెంగ్ లైన్‌మెన్ వెంకటరమణలపై సస్పెన్షన్ వేటు పడటం విద్యుత్‌శాఖలో తీవ్ర కలకలం రేపింది. దీంతో మిగతా సిబ్బంది అంతా అప్రమత్తమయ్యారు. గత నెల 18న అక్రమ విద్యుత్ కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఆలూరు డీఈఈ నాగేంద్ర ప్రసాద్ అనుమతి ఇచ్చారని నిర్ధారణ కావడంతో జిలా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, ఆయనను సస్పెండ్ చేశారు. నెల రోజులు గడవక ముందే వెంకటరమణను సస్పెండ్ చేశారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు, జూన్ 3: కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో జరిగే ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. సోమవారం ఎన్నికల విధులపై పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న అవాంఛనీయ సంఘటనలకు కూడా తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాల్లోకి రిటర్నింగ్ అధికారుల అనుమతి పత్రం లేనిదే ఎవరినీ అనుమతించకూడదన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు, ఆర్వో, ఏఆర్వో, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోండి

వెలుగోడు, జూన్ 3: వెలుగోడు పట్టణ శివార్లలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. 7,8,9 తరగతుల్లో చేరే విద్యార్థులు ఆఫ్ లైన్ పద్ధతిలో 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 10న ఉదయం 11 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నా రు. మరిన్ని వివరాలకు పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

సచివాలయ సిబ్బంది పని వేళలు పాటించాలి

మిడుతూరు, జూన్ 3: సచివాలయ ఉద్యోగులు పని వేళలు పాటించాలని ఎంపీడీవో గంగావతి హెచ్చరించారు. మండలంలోని చింతలపల్లి, మిడుతూరు 1, మిడుతూరు 2 సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా ఎంపీడీవో తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయ సిబ్బంది కార్యాలయానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని సూచించారు.

8 నుంచి ఆర్టీసీ బస్సు పాసులు జారీ

ఆత్మకూరు, జూన్ 3: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో 8 నుంచి బస్సు పాసులను జారీ చేయనున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు బస్సు పాసులను జారీ చేయనున్నట్లు తెలిపారు. అయితే బస్సు పాస్‌ల జారీకి సంబంధించి నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురానుండడంతో సాంకేతికపరమైన సమస్యల కారణంగా ఈ నెల6, 7 తేదీల్లో బస్సు పాస్‌లను జారీ చేయడం లేదని తెలిపారు. 8వ తేదీ నుంచి స్థానిక డిపోలో బస్సు పాసులను జారీ చేయనున్నట్లు వివరించారు.

విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు

గడివేముల, జూన్ 3: అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని అన్నారు. అనుమతులు లేకుండా సభలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని అన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపేదలకు అవకాశం కల్పించాలి


దేవదాయ శాఖ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: దేవాలయ భూముల బహిరంగ వేలం పాటల్లో పేదలకు అవకాశం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో నంద్యాలలోని దేవదాయ శాఖ జిల్లా అధికారికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్ళారు. అధికారి అందుబాటులో లేక పోవడంతో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. పేదలు సాగు చేస్తున్న దేవాలయ భూములు పేదలకే కౌలుకు ఇవ్వాలని కోరారు. జిల్లాలోని పేదల బతుకుల్లో మార్పు రావడం కోసం దేవదాయ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దేవాలయ భూముల బహిరంగ వేలంలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుబ్బరాయుడు, రామచంద్రుడు, ప్రసాద్, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రజలందరు ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపులో భాగంగా ఆత్మకూరు పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమల్లో ఉంటుందని అన్నారు. జనం ఎక్కడా గుంపులుగా ఉండరాదని తెలిపారు. ఒక గ్రామానికి చెందిన వ్యక్తులు మరో గ్రామానికి రాకూడదని సూచించారు. పట్టణంలో టీస్టాల్స్, ఇతర హోటళ్లు మూసివేయాలని తెలిపారు. కౌంటింగ్ రిజల్ట్ నేపథ్యంలో రెచ్చకొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఫలితాల అనంతరం సంబరాలు, ర్యాలీలు, టపాసులు కాల్చడం వంటి చర్యలకు పాల్పడరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు

- గెలుపుపై టీడీపీ, వైసీపీల ధీమా
- గెలుపోటములపై భారీగా బెట్టింగ్
- శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికో..!

ఆత్మకూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారంతో తేలనుంది. నంద్యాల సమీపంలోని ఆర్‌జీఎం కళాశాలలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల అధికారులు భారీ బందోబస్తు నడుమ కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బరిలో నిలిచారు.

23 రౌండ్లలో 226 ఈవీఎంల ఓట్ల లెక్కింపు :

శ్రీశైల నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూ రు, మహానంది మండలాల్లో మొత్తం 226 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా బూత్‌ల ఓట్లను 23రౌండ్లలో లెక్కించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతిరౌండ్‌లో 10టేబుళ్లను ఏర్పాటు చేసి వరుస క్రమంలో పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను లెక్కించనున్నారు. ఇందులో మొదటగా శ్రీశైలంలోని మేకలబండలోని మండల పరిషత్ మోడల్ స్కూల్ పోలింగ్ కేంద్రంతో ప్రారంభించి చివర్లో మహానంది మండలంలోని బసాపురం పోలిం గ్ కేంద్రం ఈవీఎంలోని ఓట్లను లెక్కించనున్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి మొత్తం 4టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో మూడు టేబుళ్ల ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించగా మరొక టేబుల్‌పై కేంద్ర బలగాల్లో పనిచేస్తున్న జవాన్ల సర్వీసు ఓట్లను లెక్కించనున్నారు. కాగా ఈ ఎన్నికలో మొత్తం 2281 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ 2179 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే హోమ్ ఓ టింగ్ కింద 85ఏళ్ల పైబడిన వారు 52 మంది దరఖాస్తు చేసుకోగా వారి లో 50 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఆర్మీ ఉద్యోగాల్లో పనిచేస్తున్న సర్వీసు ఓటర్లు 485 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 191 మంది పోస్టు ద్వారా తమ బ్యాలెట్లను పంపించినట్లు తెలిసింది. పోస్టల్ బ్యాలెట్లను ప్రతి టేబుల్‌కు 500చొప్పున లెక్కించనున్నారు.




బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


శిల్పా చక్రపాణిరెడ్డి



గెలుపోటములపై భారీగా బెట్టింగ్ :

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శ్రీశైలం నియోజకవర్గంలో భారీగా బెట్టింగ్‌లు జరిగాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న అంశంపై బెట్టింగ్‌రాయుళ్లు పందేలు వేశారు. అదేవిధంగా శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బుడ్డా, వైసీపీ శిల్పా గెలుపోటములపై కూడా భారీ స్థాయిలో బెట్టింగ్‌లు వేశారు. అంతేకాకుండా మెజార్టీ లెక్కలపై కూడా పలువురు ఆసక్తిగా పోటీపోటీగా పందెలు కాశారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు కూడా శ్రీశైలం నియోజకవర్గం ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ వేయడం గమనార్హం.

శ్రీశైలం అసెంబ్లీ బరిలో 18 మంది అభ్యర్థులు :

శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 18 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో వీరిలో బుడ్డా రాజశేఖరరెడ్డి(టీడీపీ) సింగారెడ్డి చక్రపాణిరెడ్డి (వైసీపీ) చింతా నాగేశ్వరరావు(జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ), సయ్యద్‌మహ్మద్ సికిందర్‌బాషా(జైభారత్ నేషనల్ పార్టీ), పల్లె చంద్రశేఖర్(బహుజన సమాజ్ పార్టీ), మహ్మద్ యూనస్ (ఎస్‌డీపీఐ), ఆసర్ సయ్యద్ ఇస్మాయిల్ (కాంగ్రెస్), గుండ్ల మల్లికార్జున (నేషనల్ మహాసభ పార్టీ), జయనారపు రెడ్డి (జాతీయ జనసేన పార్టీ) లోకేశ్వరరెడ్డి (జై హిందూస్థాన్ పార్టీ), యనకండ్ల మధు (సమాజ్‌వాదీ పార్టీ), కంపమల్ల మధుగౌడ్ (నవభారత నిర్మాణ సేవా పార్టీ), మేడిగ సుస్మిత (జైభీమ్‌రావ్ భారత్ పార్టీ), పెద్దిరెడ్డి గంగాధర్ రెడ్డి, పట్టికల్ల ఇలియాస్, అల్లె ఈశ్వరరెడ్డి, యాలూరి తిమ్మయ్య, జయకుమార స్వామి (ఇండిపెండెంట్లు) ఉన్నారు. అయితే పోటీ మాత్రం ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ మధ్యే ఉందని చెప్పవచ్చు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- శ్రీశైలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుధారాణి

ఆత్మకూరు, జూన్ 3: నంద్యాల సమీపంలోని ఆర్‌జీఎం కళాశాల కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్న శ్రీశైలం నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సుధారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 23రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతిరౌండ్‌లో 10టేబుళ్ల చొప్పున కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతోందని అన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం మరో 4 టేబుళ్లపై లెక్కించనున్నట్లు వివరించారు. ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్, ఒక అదనపు సిబ్బంది ఉంటారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ టేబుళ్ల వద్ద అదనంగా మరో తహసీల్దార్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని చెప్పారు. కాగా కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6గంటల్లోగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని సంతకాల ప్రక్రియ పూర్తి చేసి 8గంటల నుంచి కౌంటింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏజెంట్లకు సెల్‌ఫోన్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఓట్ల లెక్కింపునకు అంతరాయం కలిగిస్తే కేంద్రం నుంచి పంపిస్తామని హెచ్చరించారు. మద్యం తాగివస్తే ఎంట్రీలోనే పోలీసుల ద్వారా బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించి అనుమతిస్తామని తెలిపారు. ఆయా పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపునకు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న శ్రీశైలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుధారాణి

శ్రీశైలంలో భక్తుల రద్దీ


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు




రథం లాగుతున్న భక్తులు

శ్రీశైలం, జూన్ 3: శ్రీశైలం మహాక్షేత్రానికి సోమవారం తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. సోమవారం వేకువ జాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్ట వద్ద స్వామివారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు.

వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు.

పడకేసిన వాటర్ ప్లాంట్

పట్టించుకోని పంచాయతీ అధికారులు


మరమ్మతుకు నోచుకోని వాటర్ ప్లాంటు

నంద్యాల రూరల్, జూన్ 3: నంద్యాల మండలంలోని అయ్యలూర్ గ్రామ పరిధిలోని అయ్యలూర్ మెట్టలో ప్రజలకు శుద్ధ జలాన్ని అందిస్తున్న వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. అప్పటి ఎంపీ ఎస్పీవైరెడ్డి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేశారు. అయితే గత నెల రోజులుగా పని చేయడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి పదే పదే మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో 300 కుటుంబాలు ఉన్నాయి. వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో మంచి నీరు దొరకడం కష్టమైందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటర్‌ప్లాంటుకు మరమ్మతులు చేయించి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విస్తారంగా వర్షాలు

- పొంగిపొర్లిన వాగులు వంకలు
- పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


పాణ్యం సమీపంలోని వద్దెల వాగులో ప్రవహిస్తున్న వర్షపు నీరు


నల్లకాలువ గ్రామంలోని పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


గోస్పాడు మండలంలో కుందూ నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపు డెక్కను తొలగిస్తున్న దృశ్యం


పాణ్యం షాదీఖానాలోకి చేరిన వర్షపు నీరు

ఆత్మకూరు, జూన్ 3: ఆత్మకూరు ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురియడంతో 84.2మిమీల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. తిక్కయ్యస్వామిదర్గా, అప్పారావువీధి, కేజీరోడ్డు, కప్పలకుంట, సాయిబాబానగర్ తదితర ఏరియాల్లో రోడ్లపై వర్షంపునీరు నిలిచి చిత్తడిగా మారడంతో ఇబ్బందులు తప్పలేదు.

తంగడంచలోని ఎస్సీ కాలనీలో నిలిచిన నీరు



జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారేవరకు భారీవర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పారుమంచాల, తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాల్లో విద్యుత్తు తీగలపై చెట్లు కూలడంతో రాత్రంతా విద్యుత్తుకు అంతరాయం కలిగింది.

వెలుగోడు: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్లు జలమయమయ్యాయి.

మిడుతూరు: మిడుతూరు మండల కేంద్రంలో ఆదివారం రాత్రి నుంచి తెల్లావారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షం కారణంగా చింతలపల్లి, దేవనూరు, చౌట్కూరు మిడుతూరు గ్రామాల్లో కుందూ నది, కాకిలేరులు ప్రవహించాయి.

నందికొట్కూరు: ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు చేరడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీపనగండ్ల వాగు వర్షపు నీరు ఉప్పొంగి ఎగువ భాగంలో ఉన్నటువంటి పొలాల్లో చేరి, దిగువ భాగంలో ఉన్నటువంటి హాస్పిటల్‌లో చేరడంతో చెరువును తలపించిందంటూ సీపీఐ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, రఘురాంమూర్తి మాట్లాడుతూ వర్షపు నీటితో నిండిపోయిన హాస్పిటల్ ఆవరణలో సంబంధిత అధికారులు స్పందించి నీరు బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

- నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో అత్యధికంగా నందికొట్కూరు మండలంలో 80.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాతి స్థానంలో జూపాడుబంగ్లా 77.4 మి.మీటర్లు, కొత్తపల్లి 64.6మి.మీటర్లు, పాములపాడు 58.2,మిడ్తూరు 54.2మి.మీటర్లు, పగిడ్యాల 38.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో నందికొట్కూరు మండల సాధారణ వర్షపాతం 75.4 మి.మీటర్లు కాగా, ఆదివారం ఒకే రోజు 80.2 మి.మీటర్ల మేర వర్షం కురిసి 6మి.మీటర్లు అధికంగా నమోదైంది.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుఝాము వరకు భారీ వర్షం కురిసింది. మండలంలో 8.42 సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని కరివేన, నల్లకాలువ, అమలాపురం ,ముష్టపల్లి, సిద్దపల్లి, కురుకుంద,సిద్ధాపురం,కృష్ణాపురం, సంజీవ్ నగర్ తాండ తదితర గ్రామాల్లో పలు కాలనీల్లోని రోడ్లపై నీరు నిలిచింది.

కొత్తపల్లి: నిప్పులకొలిమిలా మండిన ఎండలతో అల్లాడిపోయిన జనాలకు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలో కురిసిన తొలకరి వర్షాలకు పుడమి తల్లి పులకరించింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలోని దుద్యాల, కొత్తపల్లి, నందికుంట, గువ్వలకుంట్ల, గుమ్మడాపురం,శివపురం, ఎర్రమటం, ముసలి మడుగు, ఎదురుపాడు తదితర గ్రామాల్లో భారీ వర్షం పడటంతో 64.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.

గోస్పాడు: గోస్పాడు మండలంలో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. మండలంలో 50.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తేళ్ళపూరు - రాయపాడు గ్రామాల మధ్య ఉన్న కుందూనది బ్రిడ్జి గండ్లకు గుర్రపు డెక్క ఆకు అడ్డంగా ఉండడంతో తేళ్ళపూరు గ్రామ సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆకును తొలగించి నీటి ప్రవాహం సాఫీగా పోయేలా చేశారు.

పాణ్యం: మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి గ్రామాలన్నీ జలమయమయ్యాయి. పాణ్యం, బనగానపల్లె రహదారిపై వద్దెలవాగు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలపనూరు కానుగల వాగు, జుర్రాగు, మునుకుందు వాగులు పొంగి ప్రవహించాయి.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు వర్షం పడింది. దీంతో మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నాగటూరు, కొణిదేల, గ్రామాల్లోని పొలాల్లో నీరు పారింది.


మిడుతూరులో కుందూ నదిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు


నందికొట్కూరు హాస్పిటల్ ఆవరణలో చేరిన వర్షపు నీటిని చూపుతున్న సీపీఐ నాయకులు


కొణిదేల గ్రామ పొలాల్లో పారుతున్న వర్షపు నీరు


ఆత్మకూరులో పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

అహోబిలంలో మాజీ మంత్రి పూజలు



పూజలు చేస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూన్ 3: మాజీ మంత్రి అఖిలప్రియ అహోబిలంలో సోమవారం పూజలు చేశారు. ఈమె అహోబిలంలోని మళ్లమ్మ అమ్మ వారిని, భూవరహన్నసింహస్వామి, ఎగువ అహోబిలంలోని ఉగ్రనరసింహస్వామిని దర్శించుకొని వేదపండితులు ఇచ్చిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈమె వెంట అహోబిలం టీడీపీ నాయకులు ఎస్ఎల్ రమణ, అంజి, వంశీ, ఆళ్లగడ్డ కాంట్రాక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

బనగానపల్లె, జూన్ 3: బనగానపల్లె ఏపీ మోడల్‌స్కూల్ రవ్వలకొండలో 2024 -25 విద్యాసంవత్సరానికి 7,8,9 తరగతిలో సీబీఎస్ఈ, ఇంగ్లీషు మీడియంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి సోమవారం తెలిపారు. ఈనె 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, జూన్ 8న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ

కోవెలకుంట్ల, జూన్ 3: కోవెలకుంట్ల సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కానున్న నేపథంలో ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాలలో తన సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లా డుతూ రాష్ట్రం మొత్తం సెక్షన్ 144, 34 అమలులో ఉన్నా నేపథ్యంలో కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోని ప్రజలు గుంపులు గుంపులుగా తిరగరాదని, కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలో 13 చోట్ల పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఊరేగింపులకు, ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవని, బాణాసంచాలను కాల్చరాదని అన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి, గొడిగనూరు, చిన్న బోదనం గ్రామాల్లో ప్రత్యేకంగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కౌంటింగ్ నేపద్యంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని సూచించారు.

ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు లేవు

బనగానపల్లె, జూన్ 3: కౌంటింగ్ సందర్భంగా ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతులు లేవని బనగానపల్లె సీఐ సుబ్బారావు సోమవారం పేర్కొన్నారు. అలాగే విజయోత్సవ ర్యాలీలో బాణాసంచా నిషేధం విధించినట్లు తెలిపారు. కౌంటింగ్ తరువాత అత్యంతత సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచా మన్నారు. ఏపీ ఎస్పీ, సీఆర్‌పీఎఫ్ బలగాలను అవసరమైన చోట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామన్నారు.

సోషల్ మీడియాపై నిఘా

ప్యాపిలి, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపాథ్యంలో పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడి యా వేదికగా రెచ్చకొట్టే వ్యాఖ్యలు, వీడియోలు, ఎటువంటి బెది రింపులకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ర్యాలీలు, బాణాసంచా పేల్చడం వంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. పోలీసుల నిబంధనలను అతి క్రమిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీలో చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు

శిరివెళ్ల, జూన్ 3: మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ తదితర కోర్సులతో పాటు ఎన్‌సీసీ యూనిట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ ఫీజుతో పాటు తమ ఒరిజనల్ టీసీ, ఇంటర్, పదో తరగతి మార్క్స్ మెమో, స్టడీ సర్టిఫికెట్లు, ఫోటోతో కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వద్దు

రుద్రవరం, జూన్ 3: చెంచులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని డీఎంహెచ్‌వో వెంకటరమణ, డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసరు కామేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడేన్ని సందర్శించారు. చెంచులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వేడి చేసి చల్లార్చిన నీరు తాగాల న్నారు. చద్దన్నం తినరాదని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసరు ప్రసాద్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసరు శివచంద్రరెడ్డి, కార్యదర్శి షాహినూర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

బనగానపల్లె, జూన్ 3: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమవారం కోరారు. బనగానపల్లె పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవ సాయ విస్తరణాధికారి ఓబులేసుకు ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలకృష్ణ, సహా య కార్యదర్శి మద్దిలేటి, ఇమాంహుసేన్‌లు వినతిపత్రి సమర్పించారు. ఈసందర్భంగా సోమన్న మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారం భమవుతున్న తరుణంలో నాణ్యమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, సబ్సిడీతో విత్తనాలు అందిం చాలని, నకిలీ విత్తనాలు అరికట్టాలని, దుకాణాలను తనిఖీ చేసి రైతు లకు నాణ్యమైన ఎరువులను ఇవ్వాలని, సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివనాగయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధ రామేశ్వర స్వామికి విశేష పూజలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 3: మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వైశాఖ బహుళ పక్షం ద్వాదశి పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగు కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె సమీపంలో కొలువుదీరిన గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

డోన్(రూరల్): డోన్ పట్టణ సమీపంలోని పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సోమ వారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్త బైసాని రాజు ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీదే విజయం: బీసీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 3: రాష్ట్రంలో తెలుగుదేశం టీడీపీ కూటమితే విజయమని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయ న బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, చంద్రబా బునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. టీడీపీ నాయ కులు, కార్యకర్తల కృషితో పాటు యువకులు, ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు, మహిళలు, వైసీపీ వర్గీయులచే అణచివేయబడ్డ వర్గీయుల ఆశీస్సులతో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు తన గెలుపు కోసం ఎంతో కష్టపడ్డారని, వారికి రుణపడి ఉం టానని ఎమ్మెల్యే బీసీ పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్ని రాష్ట్రంలో కూటమే అధికారంలోకి వస్తుందని సర్వేలో తేల్చారన్నారు. వైసీపీ అవినీతి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున ఎగసి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారన్నారు. చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తమ విజయంలో ప్రధాన భూమిక పోషించనున్నట్లు బీసీ తెలిపారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి: కౌంటింగ్ సమ యంలో ఏజెంట్లలంతా అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ పార్టీ కార్యాలయంలో టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ నంద్యాల శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కౌంటింగ్ మంగళవారం హాజరవుతున్న ఏజెంట్లకు ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. ఏజెంట్లు వారికి కేటాయించిన టేబుల్ వద్ద ఉండి ప్రతి విషయాన్ని గమనిం చాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై ఏదైనా అనుమానాలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతోపాటు ఆర్‌వోకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

మద్యం దుకాణాలు మూత



మద్యం దుకాణం వద్ద కిక్కిరిసి ఉన్న మద్యం ప్రియులు

చాగలమర్రి, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్ మంగళవారం ఉండడంతో మద్యం దుకాణాలు మూసి వేస్తున్నట్లు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో మద్యం ప్రియులు రెండు రోజుల నుంచే మద్యం కొనుగోలు చేసేందుకు మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు చాగలమర్రిలోని మూడు మద్యం దుకాణాలు, ముత్యాలపాడులోని మద్యం దుకాణం సంబంధిత సూపర్‌వైజర్లు మూత వేసి సీజ్ చేశారు.

భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలుచోట్ల దెబ్బతిన్న రహదారులు





బనగానపల్లె మండలం టంగుటూరు సమీపంలో పెద్ద పిల్ల వంక, వర్షపు నీటితో నిండిన బనగానపల్లె విద్యుత్ కార్యాలయం

బనగానపల్లె రూరల్, జూన్ 3: మండల వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు ప్రవహించాయి. బనగానపల్లె - నంద్యాల ప్రధాన రహదారిలో తిమ్మాపురం గ్రామం వద్ద ఉన్న పచ్చర్ల వాగు, టంగుటూరు గ్రామ సమీపంలోని అలుగాగు, చిన్న పిల్ల వంక, పెద్ద పిల్ల వంకలు ప్రవహించాయి. యాగంటి సమీపంలోని పర్కులేషన్ ట్యాంక్‌కు భారీగా వరద వచ్చి చేరుతోంది. వరద ప్రవాహంతో కుక్కలగుంటి చెరువులో ఆరు అడుగుల మేరకు నీరు చేరుకుంది.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో తొలకరి వర్షాలు సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యాయి. బనగానపల్లె మండలంలో సోమవారం భారీగా 17.88 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఉదయం 7 గంటల వరకు కొనసాగింది. భారీ వర్షపాతం నమోదు కావడంతో బనగానపల్లె పట్టణంలో వర్షపునీరు విద్యుత్ కార్యాలయానికి భారీగా చేరుకుంది. సుమారు 5 అడుగులకుపైగా నీరు చేరడంతో బనగానపల్లె పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, ఉన్నత పాఠశాల మైదానం వర్షపునీటితో నిండిపోయింది. విద్యుత్ కార్యాలయానికి భారీగా నీరు చేరడంతో విద్యుత్ ఏఈ నాగరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ షబ్బీర్, విద్యుత్ సిబ్బంది నీటిని మోటార్లతో తోడి బయటకు పంపారు. అనంతరం ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. భారీ వర్షాల పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. మొక్కజొన్న, ప్రత్తి, వేరుశనగ తదితర పంటలు వేయడానికి రైతన్నలు సమాయాత్తమవుతున్నారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలోని ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామ పరిసరాల్లో పెద్ద ఎత్తున చెట్లు నేలకొరిగాయి. ఇటిక్యాల సమీపంలో ప్రధాన రహదారిలో వేప చెట్టు కూలిపోగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కనకాద్రిపల్లె సమీపంలో కోనాపురం నారపురెడ్డి ఫ్యాక్టరీలో చెట్లు, ఇళ్లపై పడటం, రేకులు లేచిపోవడంతో, సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కొలిమిగుండ్లతోపాటు, పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బెలుంశింగవరం గ్రామంలో పిడుగు పడటంతో మహేశ్వరరెడ్డి ఇంటి గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

రుద్రవరం: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 35.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఏర్లు, వాగులు ప్రవహించాయి. గాలివానకు భారీ వృక్షాలు నేలకొరిగాయి.

కోవెలకుంట్ల: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు వంకలు పొంగి ప్రవహించారు. లింగాల, వల్లంపాడు గ్రామాల మధ్య ఉన్న కప్పలవాగు, వల్లంపాడు చిన్నకొప్పెర్ల గ్రామాల మధ్య ఉన్న నల్లవాగు, చిన్నకొప్పెర్ల, పెద్ద కొప్పెర్ల గ్రామాల మధ్య ఉన్న కైప వాగు, పెద్దకొప్పెర్ల, ఎంగోవిందిన్నె గ్రామాల మధ్య ఉన్న ఎర్రవాగులు ఉధృతంగా ప్రవహించడంతో పైగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతపురం జిల్లా యాడికి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, రామసుబ్బయ్య, దస్తగిరిరెడ్డి అను గొర్రెల కాపరులు, నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నుంచి వల్లంపాడు మీదుగా కోవెలకుంట్లకు గొర్రెలు తోలుకుంటూ వల్లంపాడు వద్దకు వచ్చే సరికి నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గొర్రెల కాపరులు ఆవాగులో గొర్రెలు దింపి అవతలకు దాటేందకు యత్నించగా 20 గొర్రెలు గల్లంతయ్యాయి.

ప్యాపిలి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ప్యాపిలి, కలచట్ల, పెద్దపూదిళ్ల, వెంగళాంపల్లి, గుడిపాడు, పీఆర్‌పల్లి తదితర గ్రామాల్లో ఈ వర్ష కురిసింది. దీంతో గ్రామాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. అలాగే వర్షం కురువడంతో వాతవరణం చల్లబడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవుకు: అవుకులో సోమవారం తెల్ల వారుజామున కురిసిన వర్షం 66.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. గత నెలలో కూడా ఓ మోస్తారు వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు పొలాలను దుక్కులు దున్నుకున్నారు. రైతులు ఏ పంటను సాగు చేయాలనే విషయంపై సమాలోచనలు జరుపుతున్నారు. వేసవితో అల్లాడిపోతున్న ప్రజలు తొలకరి జల్లులతో కొంత ఉపశమనం లభించింది.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి నుండి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కుందూ నదికి భారీగా వరద నీరు వచ్చి చేరింది. బలమైన గాలులు వీయడంతో భారీ వృక్షాలు నేలకొరిగాయి. బోడెమ్మనూరు - కాకరవాడ ప్రధాన రహదారిలో భారీ వేపచెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. రోడ్డుపై అడ్డంగా పడిపోయిన వేప చెట్టును తొలగించాలని వాహనదారులు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దొర్నిపాడు: మండలంలో ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 63.2మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. 20 రోజులుగా ఉక్కపోత, ఎండవేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలకు భారీ వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. కుందూనదిలో వర్షపు నీటితో జలకళ సంతరించుకుంది. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నీరు నిల్వ చేరింది.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అహోబిలం పుణ్యక్షేత్రంలోని నల్లమల అటవీ ప్రాంతంలో బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది.

సంజామల: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు 30 మిలీమీటర్లు వర్షపాతం నమోదైంది. తొలకరిలో ఇంతటి భారీవర్షం కురియడం ఇదే ప్రథమ మని రైతులు హర్షిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించడంతో వేసవి ఉక్కపోతకు అల్లాడిపోయిన ప్రజలు ఉపశ మనం పొందారు. సకాలంలో వర్షాలు కురుస్తే ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.







లింగాల వల్లంపాడు మధ్య ప్రవహిస్తున్న కప్పలవాగు, రుద్రవరం మండలంలో కూలిన భారీ వృక్షం, కోవెలకుంట్ల మండలంలో మృతి చెందిన గొర్రెలు

సైకిల్ స్పీడు పెరిగింది..

డోన్(రూరల్), జూన్ 3: రాష్ట్రంలో సైకిల్ స్పీడు పెరిగిందని, టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థికి అనుకూల పరిస్థితులు రానున్నా యని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు అన్నారు. సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాతబస్టాండులో ఏఈ నాగరాజు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల ఫలితాల్లో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు.

దుకాణాలు తెరువకూడదు: ఎంపీడీవో

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం దుకాణాలు తెరువకూడదని కొలిమిగుండ్ల ఎంపీడీవో సాయిక్రిష్ణ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల్లో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున చిరు దుకాణాలు, హోటళ్లు, ఇతర దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. మరోవైపు మండల క్రేందమైన కొలిమిగుండ్లలో మంగళవారం నిర్వహించే వారపు సంత నేడు నిర్వహించడంలేదని, కూరగాయల వ్యాపారులు, వినియోగదారులు సంత నిర్వహణ కోసం కొలిమిగుండ్లకు రావద్దని సూచించారు. రాజకీ య పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలందరూ నిబంధనలు పా టించి సహకరించాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు: సీఐ

బేతంచెర్ల, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ ముగియగానే గెలుపు ఓటములు దృష్టిలో ఉంచుకుని ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ ప్రియతమ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అలాగే హోటళ్లు, అంగళ్ల వద్ద గుంపులు గుంపులుగా ఎవరూ కూడా ఉండకూడదాన్నారు. మెడికల్ షాపులు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

సంజామల: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై రమేష్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల ఫలితాల రోజు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. రెచ్చగొట్టే ప్రకటనలు, వ్యాఖ్యలు చేయరాదన్నారు. అభ్యర్థుల గెలుపు అవకాశలపై వాదనలు చేయరాదని బాణాసంచా , మద్యం, లౌడ్ స్పీకర్లు, కర్రలు, రాళ్ళు మొదలైన వస్తువులు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో భాగంగా అసెంబ్లీ, పార్లమెంటు కౌంటింగ్ మంగళవారం ప్రారంభం కానుందని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో 144 సెక్షన్, పోలీసు 30 యాక్టు అమలులో ఉందన్నారు. విజయోత్సవాలు జరిపి టపాసులు పేల్చినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలు గుంపులు గుంపులుగా ఎవరూ కూడా ఉండకూడదని అన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



చాగలమర్రి బ్యాంకు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

చాగలమర్రి, జూన్ 3: చాగలమర్రి గ్రామంలోని ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకు సేవా కేంద్రాల వద్ద పింఛన్ కోసం సోమవారం ఉదయం నుంచే పింఛన్‌దారులు పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాశారు. వృద్ధులు పింఛన్ సొమ్ము కోసం పింఛన్‌దారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు వద్దకు వెళ్తే టెక్నికల్ సమస్యలతో వృద్ధులు అగచాట్లు పడుతున్నారు. వేలి ముద్ర వేయించుకొని పింఛన్ పంపిణీ చేస్తుండటంతో జాప్యం అవుతోంది. కొందరికి పింఛన్ సొమ్ము పడక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల నిర్వాహకం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని పింఛన్‌దారులు వాపోతున్నారు. బ్యాంకు సేవా కేంద్రాలు, సర్వీసు సెంటర్లు బ్యాంకుల చుట్టూ తిరగ లేక పోతున్నామని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం గురించి ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డిని వివరణ కోరగా మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 6,417 పింఛన్‌లు మంజూరయ్యాయని, 1,290 పింఛన్‌లను సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌దారులకు పంపిణీ చేశారన్నారు. 4,867 పింఛన్‌లను పింఛన్‌దారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని అన్నారు. రూ.1,90,92,500 పింఛన్ సొమ్ము మంజూరైందని అన్నారు. పింఛన్‌దారులు బ్యాంకులు, సేవా కేంద్రాల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాలని సూచించారు.

బేతంచెర్ల: పట్టణంలో యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల వద్ద వృద్ధులు పింఛన్ల కోసం నిరీక్షించారు. గతంలో ఇంటింటికి వెళ్లి వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేవారని వృద్ధులు తెలిపారు. అయితే బ్యాంకు అకౌంట్లో పింఛన్ డబ్బులు పడాలంటే ఆధార్ కార్డు నెంబరు, ఈకేవైసీ అయి ఉంటే బ్యాంకులో డబ్బులు పడతాయన్నారు. ఈ డబ్బులు బ్యాంకులో పడ్డాయా లేదా అనేది తెలుసుకోవాలంటే బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సి వస్తుందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బేతంచెర్ల మినీ స్టేట్ బ్యాంకు వద్ద..

భూమా అఖిలప్రియ గెలవాలని పూజలు

చాగలమర్రి, జూన్ 3: ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ గెలవాలని సోమవారం సాయంత్రం చాగలమర్రి రామలింగేశ్వర ఆలయంలో టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, వి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద 101 కొబ్బరి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అత్యధిక మెజార్టీతో అఖిలప్రియను గెలిపించాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ బీసీ సంఘం అధ్యక్షుడు రామతీర్థం, టీడీపీ నాయకులు సుబ్బయ్య, అనిఫ్, అజీమ్, కరిముల్లా, గఫార్, నూర్‌బాష, కె.ఆర్.కె.రవి, మురళీ, రమేష్, ఓబులేసు, బషీర్, ఖాదర్, సుబ్బారావు, బాలకృష్ణ, రమణ, నరేంద్రా, చోటు, అబ్దుల్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

నేడు బంద్

ఆళ్లగడ్డ, జూన్ 3: కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో బంద్ నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు సోమవారం చెప్పారు. ప్రధానంగా కౌటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పట్టణంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలందరు ఎవరి ఇళ్లలో వారు ఉండాలని, ఘర్షణలకు పాల్పడితే చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.